
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం | 18 | ఏప్రిల్ | 2024



డెల్టాకు 5,800 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 5,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 8 అడుగుల వద్ద నీటి మట్టం కొనసాగుతోంది.



'సీతా' కల్యాణం.. ఊరూ'రా మ'హోత్సవం

శ్రీరామ నవమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి.

8లో

గరిష్టం/కనిష్టం
44.0° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.0	26.0
కాకినాడ	38.8	27.0
అమలాపురం	40.0	26.0

న్యూస్‌రీల్

377 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

అమలాపురం రూరల్/ముమ్మిడివరం: జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు 377 కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటి ద్వారా ఈ నెల ఒకటి నుంచి ధాన్యం సేకరణ జరుగుతోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,183, గ్రేడ్ ఏ రకానికి రూ.2,203 మద్దతు ధర ఇస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాలల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సహాయకులను నియమించి వారికి తర్ఫీదు ఇవ్వటం జరిగిందన్నారు. కళ్లేల వద్దనే ధాన్యం నమూనాలు సేకరించి, తేమ శాతం పరీక్ష జరిపి, ధాన్యాన్ని సేకరిస్తున్నామన్నారు. ఒకవేళ రైతులు గోనె సంచులను, హమాలీలను, రవాణా వాహనాలు ఏర్పాటు చేసుకుంటే, వాటి చార్జీలను రైతుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కోసం రైతులు మిల్లర్లను సంప్రదించాల్సిన అవసరం లేదన్నారు. అలా చేయాలని ఎవరైనా బలవంతం చేసినా, ధాన్యం కొనుగోలులో ఇతరత్రా సమస్యలు, ఫిర్యాదులు ఉన్నా జిల్లా కంట్రోల్ రూమ్ 1800 425 2532 నంబర్‌కు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ తెలియజేయవచ్చన్నారు.

నేడు అవగాహన సదస్సు

ముమ్మిడివరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సహిత విద్యా కార్యక్రమాలపై ఒక రోజు ఓరియంటేషన్ సదస్సును గురువారం నిర్వహించనున్నారు. సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్ ఎ.మధుసూదన రావు పర్యవేక్షణలో సమగ్ర శిక్షా సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమల కుమారి, జిల్లాలోని 22 మండలాలకు చెందిన 44 మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, అధికారులు, సూపర్‌వైజర్లు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాల్గొంటారు.

మోగనున్న సమర శంఖం



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణాలు రానే వచ్చాయి. సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాలుగా రాష్ట్ర అభ్యుదయ రథాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రత్యక్షంగా చూద్దామని ఎదురుచూస్తున్న వారికి ఇది శుభవార్త. ఆయన ఎన్నికల సమర శంఖం పూరించదానికి వస్తున్నారన్న కబురు జనంలో ఆనందం నింపుతోంది. మేమంతా సిద్ధం బస్సుయాత్ర జిల్లాకు నేడు రానున్న నేపథ్యంలో తమ ప్రియతమ నేతను సమీపం నుంచి చూద్దానికి జనం ఆసక్తిగా వేచి ఉన్నారు.

- నేడు ఉమ్మడి 'తూర్పు'లో మేమంతా సిద్ధం
- 85 కిలోమీటర్లు రోడ్‌షోగా బస్సుయాత్ర
- రెండు జిల్లాలు... ఆరు నియోజకవర్గాల్లో పర్యటన
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామంటూ ఎన్నికల్లో మద్దతు కోసం వస్తున్న జగన్
- స్వాగతించేందుకు సిద్ధమవుతోన్న జనం

సాక్షిప్రతినిధి, కాకినాడ: నాడు సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు చేసిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'తూర్పు'న ఎన్నికల సమర శంఖారావాన్ని పూరించనున్నారు. ఇందు కోసం మేమంతా సిద్ధం బస్సు యాత్ర 17వ రోజు గురువారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు తెరలేచిన తరువాత తొలిసారి వస్తోన్న జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు, పార్టీ శ్రేణులు మేమతా సిద్ధమంటూ సన్నద్ధమవుతున్నాయి. మేమంతా సిద్ధం బస్సు యాత్ర వచ్చే మార్గంలో ప్రజలు అఖండ స్వాగతం పలికేందుకు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు పశ్చిమగోదావరి జిల్లా తణుకు శివారున తేతలి రాత్రి బస నుంచి బయలుదేరతారు. అక్కడి నుంచి ఈతకోట, రావులపాలెం, జొన్నాడ జంక్షన్ మీదుగా పొట్టిలంక చేరుకుంటారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం కడియపులంక, మేమగిరి, మోరంపూడి జంక్షన్, తాడితోట జంక్షన్, చర్చి సెంటర్, దేవీచౌక్, పేపరుమిల్లు సెంటర్, దివాన్‌చెరువు, రాజానగరం మీదుగా ఎస్టీ రాజాపురంలో రాత్రి బస చేసే శిబిరానికి చేరుకుంటారు.

ఆసక్తిగా అభిమానుల ఎదురుచూపులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగే మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఏర్పాట్లను ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ జిల్లా నేతలు నాలుగైదు రోజులుగా పరిశీలిస్తున్నారు. తొలిరోజు జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం సిటీ, రాజానగరం, అనపర్తి ఆరు నియోజకవర్గాల్లో సాగనుంది. ఈ నియోజకవర్గాల్లో బస్సు యాత్ర సుమారు 85 కిలోమీటర్లు మేర రోడ్‌షోగా సాగేలా షెడ్యూల్ రూపొందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాగే 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర కోసం ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బస్సు యాత్ర విజయవాడ వచ్చిన సందర్భంలో సింగ్‌నగర్‌లో జగన్‌మోహన్‌రెడ్డిపై పదునైన వస్తువుతో దుండగుడు దాడి చేయడంతో గాయపడిన అనంతరం జిల్లాకు వస్తుండటంతో అన్ని వర్గాలు జగన్‌ను కలవాలి, తమ అభిమాన నాయకుడిని పలకరించాలి అని ఎదురు చూస్తున్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు రావులపాలెంలో కనీవినీ ఎరుగని రీతిలో స్వాగతించి తమ అభిమానాన్ని చాటుకోవాలని కోనసీమ వాసులు సన్నాహాలు చేసుకుంటున్నారు. అక్కడి నుంచి జాతీయ రహదారి గుండా రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గాల్లో బస్సు యాత్ర వెంట జనం వేలాదిగా తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఎదురుకాకుండా పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లీన్ స్వీప్‌పై పార్టీ శ్రేణుల గురి

2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మూడు పార్లమెంటు స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. 19 అసెంబ్లీ స్థానాల్లో నాలుగు మినహా అన్ని స్థానాల్లోను వైఎస్సార్ సీపీ పాగా వేసింది. 2022 ఏప్రిల్‌లో జిల్లాల పునర్విభజన జరిగాక తూర్పుగోదావరి జిల్లా మూడు జిల్లాలైంది. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 21 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వచ్చే ఎన్నికల్లో మూడు జిల్లాల్లో 21 స్థానాలకు 21 సెగ్మెంట్‌లలో క్లీన్ స్వీప్ చేయాలనే సంకల్పంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. నాడు పాదయాత్రలో ప్రజల కష్టాలు కళ్లారా చూసి చలించిన ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ నూటికి నూరుశాతం అమలు చేశారు. అందుకే మీ ఇంటిలో మంచి జరిగి ఉంటేనే ఓటేయండని ముఖ్యమంత్రి జగన్ ధైర్యంగా అడుగుతున్న తీరు పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపుతోంది. మేమంతా సిద్ధం బస్సు యాత్ర పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపుతుందని నేతలు అభిలషిస్తున్నారు.

ఎస్టీ రాజాపురంలో చురుగ్గా సీఎం బస ఏర్పాట్లు



ఏడీబీ రోడ్డులో సీఎం బస చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

రాజానగరం: ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. ఏడీబీ రోడ్డును ఆనుకుని ఎస్టీ రాజాపురం వద్ద రాత్రి బస చేయనున్నారు. ఇందుకు సంబంధించి పటిష్టమైన బందోబస్తుతోపాటు బస చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఎస్పీ పి.జగదీష్‌తోపాటు సీఎం భద్రతా సిబ్బంది, సెంట్రల్ డివిజన్, నార్త్, ఈస్ట్ డీఎస్పీలు, స్థానిక సీఐ, తదితరులు ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కడియపులంకలో సీఎం భోజన విరామం

కడియం: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కడియం మండలం రానున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం నుంచి జాతీయ రహదారి మీదుగా వస్తున్న ఆయన పొట్టిలంక వద్ద కడియం మండలంలో ప్రవేశిస్తారు. అక్కడి నుంచి కడియపులంక చేరుకుని అక్కడ మధ్యాహ్న భోజనం చేస్తారు. ఇందు కోసం వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో–ఆర్డినేటర్, మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. విరామం కోసం ఆగే ప్రాంతంలో సీఎం బస్సు, కాన్వాయ్ ట్రయల్ రన్‌ను కూడా అధికారులు పర్యవేక్షించారు. పొట్టిలంక నుంచి హైవేపై కుడివైపునకు సీఎం కాన్వాయ్‌ని మరల్చి, కడియపులంకలోని ఖాళీ స్థలం వద్దకు తీసుకురానున్నారు. సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్, కడియం ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ ఇతర అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

సీఎం జగన్ రోడ్ షో విజయవంతం చేయండి

- నేటి ఉదయం 10 గంటలకు రావులపాలెం సెంటర్‌కు రాక
- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



కొత్తపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సుయాత్ర రోడ్ షోను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి పార్టీ శ్రేణులు, అభిమానులకు పిలుపునిచ్చారు. ఆయన బుధవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ రోడ్ షో షెడ్యూల్‌ను వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలో తేతలి నుంచి గురువారం ఉదయం 9 గంటలకు జాతీయ రహదారి మీదుగా రోడ్ షో ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి తణుకు బైపాస్, పెరవలి, సిద్ధాంతం అడ్డరోడ్డు మీదుగా వశిష్ట వారధిని దాటి కొత్తపేట నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. అనంతరం గోపాలపురం, ఈతకోట మీదుగా ఉదయం 10.30 గంటలకు రావులపాలెం సెంటర్‌కు చేరుకుంటుందన్నారు. గౌతమి వారధి మీదుగా జొన్నాడ సెంటర్, మూలస్థానం, బొబ్బర్లంక, చెముడులంక, మడికిలో సాగుతుంది. అక్కడితో కొత్తపేట నియోజకవర్గ రోడ్ షో పూర్తవుతుందని, ఆ తర్వాత పొట్టిలంక మీదుగా కడియపులంక చేరుకుంటుందన్నారు. అక్కడ భోజన విరామం అనంతరం 4 గంటలకు బయలుదేరి వేమగిరి సెంటర్, బొమ్మూరు సెంటర్, తాడితోట సెంటర్, దేవీచౌక్ సెంటర్, సీతంపేట, దివాన్ చెరువు, రాజానగరం మీదుగా రోడ్ షో పూర్తి చేసుకుని ఎస్టీ రాజాపురంలో రాత్రి బస ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని రావులపాలెం, ఆలమూరు మండలాల్లో రోడ్ షో జరుగుతుండగా ఆయా మండలాలతో పాటు కొత్తపేట, ఆత్రేయపురం మండలాల నుంచి అత్యధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానుల మోటార్ సైకిల్ ర్యాలీతో రోడ్ షో సాగుతుందన్నారు.

ఎన్నికల నియమావళి ఫిర్యాదులపై సమీక్ష

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై సీవిజిల్ ద్వారా 416 ఫిర్యాదులు రాగా వాటిలో 88 వాటికి సంబంధం లేనివని ధ్రువీకరించినట్టు సీపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. వీటిపై బుధవారం అధికారులతో సమీక్షించారు. సీవిజిల్ యాప్ ద్వారా పౌరులు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై అందిన ఫిర్యాదుల రోజువారీ నివేదిక ప్రకారం ఈ నెల 16వ తేదీన 2 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమాలు ఉల్లంఘనలపై అందగా వాటిని 100 నిమిషాల లోపు పరిష్కరించామన్నారు.

రమణీయం.. రత్నగిరి రాములోరి కల్యాణం

- పెళ్లి పెద్దలుగా వ్యవహరించిన సత్యదేవుడు, అమ్మవారు
- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఈఓ
- కల్యాణానికి ముందు కన్నుల పండువగా ఊరేగింపు



రత్నగిరిపై వార్షిక కల్యాణ మంటపంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం : రత్నగిరి క్షేత్ర పాలకునిగా పూజలందుకుంటున్న శ్రీ సీతారాముల దివ్యకల్యాణం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా బుధవారం రత్నగిరి రామాలయం పక్కన గల వార్షిక కల్యాణ వేదికపై వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తిలకిస్తుండగా ఉదయం పది గంటల నుంచి 12–30 గంటల వరకు కన్నుల పండువగా ఈ కార్యక్రమాన్ని దేవస్థానం ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, వ్రత పురోహిత ప్రముఖుడు, వైదిక కమిటీ సభ్యుడు ఛామర్తి వేంకటరెడ్డి పంతులు (కన్నబాబు) తదితర పండితులు నిర్వహించారు.

వెండి పల్లకిపై ఊరేగింపు

ఉదయం ఏడు గంటలకు శ్రీ సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై, పెళ్లిపెద్దలు శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని వెండి పల్లకిపై గ్రామంలో ఊరేగించారు. అనంతరం వధూవరులు శ్రీసీతారాములను, సత్యదేవుడు, అమ్మవార్లను ఊరేగింపుగా రత్నగిరి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. సర్వాంగసుందరంగా అలంకరించిన వేదికపై ప్రత్యేక సింహాసనం మీద సీతారాములను పండితులు ఉంచారు. ఆ సింహాసనం పక్కనే గల మరో ప్రత్యేక ఆసనంపై సత్యదేవుడు అమ్మవార్లను ఉంచారు. ఉదయం 10–15 గంటలకు విఘ్నేశ్వరపూజతో సీతారాముల కల్యాణం ప్రారంభమైంది. ఈఓ కె.రామచంద్రమోహన్ సీతారాములకు నూతన పట్టువస్త్రాలు, మంచి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సీతారాముల తల్లితండ్రులు, వారి గోత్రనామాలతో కూడిన ప్రవరను ఛామర్తి కన్నబాబు వివరించారు.

తరువాత పుణ్యాహవచనం, యజ్ఞోపవీత ధారణ, మహాసంకల్పం కార్యక్రమాలను పండితులు నిర్వహించారు. మధ్యాహ్నం 11 గంటల సుముహూర్తంలో సీతారాముల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ఉంచారు. అనంతరం మాంగల్య ధారణ, వైభవంగా తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. రామాలయంలోని సీతారాముల మూలవిరాట్‌లకు కూడా అర్చకులు తలంబ్రాలు పోశారు. నూతన దంపతులు సీతారాములకు వేదపండితులు ఆశీస్సులందజేశారు. తరువాత సీతారాములకు నివేదించిన పానకం, వడపప్పు ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కల్యాణం సమయంలో భక్తులకు ఆచారం ప్రకారం తాటియాకుల విసనకర్రలు పంపిణీ చేశారు. శ్రీసీతారాముల కల్యాణం అనంతరం శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లకు నిత్య కల్యాణం అదే వేదికపై మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2–30 గంటల వరకు నిర్వహించారు. ఆలయ ఏఈఓ కృష్ణారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేటి నుంచి నామినేషన్ల పర్వం

- సార్వత్రిక ఎన్నికలలో కీలక ఘట్టం
- జిల్లాలో 15.10 లక్షల మంది ఓటర్లు
- 1,644 పోలింగ్ కేంద్రాలు

సాక్షి అమలాపురం: సార్వత్రిక ఎన్నికలలో కీలక ఘట్టానికి తెరలేవనుంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కానుంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి సంబంధించి నామినేషన్లు స్వీకరించనున్నారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో, అసెంబ్లీలకు ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలలో ఈ ప్రక్రియ జరుగుతుంది. నామినేషన్ల స్వీకరణకు గెజిట్ నోటిఫికేషన్ కూడా గురువారం విడుదల కానుంది.

25 వరకూ స్వీకరణ


ఈ నెల 18 నుంచి 25 వరకూ (ప్రభుత్వ సెలవులలో మినహా) ఉదయం 11:00 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. అనంతరం ఈ నెల 26న పరిశీలన జరుగుతుంది. 29న ఉపసంహరణకు అవకాశం ఉంది. అనంతరం పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మే 13న జరగనున్న విషయం తెలిసిందే. జిల్లాలోని ఓటర్ల తుది జాబితాను జనవరి 22వ తేదీన ప్రకటిస్తారు. ఆ ప్రకారం ఓటర్ల వివరాలు ఈ కింద తెలిపిన విధంగా ఉన్నాయి. జనవరి 22 తర్వాత కూడా ఓటర్ల నమోదు జరిగిన నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

అన్ని ఏర్పాట్లూ పూర్తి



జిల్లాలో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉన్నచోట నామినేషన్లు దాఖలు చేయాలి. జిల్లాలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– హిమాన్షు శుక్లా, కలెక్టర్



ఎన్నో ప్రత్యేకతలు

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారి జరుగుతున్న ఎన్నికలు కావడంతో అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టారు. గోదావరి లంకలు, సముద్ర సంగమ ప్రాంతంలో పాయల మధ్య ఉన్న గ్రామాలలో పోలింగ్ నిర్వహణపై దృష్టి సారించారు. మరో వైపు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వారిపైనా, నగదు, మద్యం సరఫరాపై పక్కాగా నిఘా పెట్టారు.
- నామినేషన్లను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ సౌకర్యం కల్పించారు. ఆన్‌లైన్‌లో నామినేషన్ వేసిన తర్వాత ధ్రువీకరణ పత్రాలను ఆర్వో కేంద్రంలో అందజేయాలి.
- ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో సామాన్య పౌరులను సైతం భాగస్వాములను చేస్తూ ఎన్నికల కమిషన్ పలు రకాల యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. సీవిజిల్, సువిధ, అబ్జర్వర్, సాక్ష్యం, కేవైసీ, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్, ఓటరు హెల్ప్‌యాప్‌లు రూపొందించింది. ఎన్నికలకు సంబంధించి సమాచారం, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులకు, ఎన్నికల నియమావళి, ఓటర్లకు అవసరమైన సాయం, ఎన్నికల ఖర్చు, పోలింగ్ బూత్‌ల తదితర సమాచారాలు తెలుసుకునేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి.
- గత ఎన్నికల వరకూ ఈవీఎంలపై అభ్యర్థుల పేర్లు, వాటికి ఎదురుగా అభ్యర్థుల గుర్తులు ఉండేవి. తాజాగా ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు కూడా ఏర్పాటు చేయనున్నారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థిని సులువుగా గుర్తించి, ఓటు వేసేందుకు ఈ సౌకర్యం కల్పించారు.
- తొలిసారిగా ఉద్యోగులు, ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందితో పాటు పాత్రికేయులకు సైతం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలింగ్ కేంద్రంలో కాకుండా ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునే విధానాన్ని ఈ ఎన్నికల్లో ప్రవేశ పెడుతున్నారు. 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులకు ఇలా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఇందుకోసం ఫారం 12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల అధికారులు సాధారణ పోలింగ్‌కు ముందే ఇంటికి వచ్చి బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయిస్తారు.
- ఓటింగ్ శాతం పెంచేందుకు నమూనా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఆదర్శ పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గానికి ఒకటి వంతున ఏర్పాటు చేయగా, ఈసారి ఎన్నికల్లో నియోజకవర్గానికి ఐదు వంతున ఏర్పాటు చేయనున్నారు. ఇక మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గత ఎన్నికల్లో నియోజకవర్గానికి ఒకటి వంతున మాత్రమే మహిళలకు పోలింగ్ కేంద్రం ఉండేది. ఈసారి వాటి సంఖ్యను పెంచనున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు (జనవరి 22వ తేదీ నాటికి)

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
రామచంద్రపురం	239	99,361	1,00,785	1	2,00,147
ముమ్మిడివరం	268	1,20,680	1,21,190	0	2,41,870
అమలాపురం (ఎస్సీ)	235	1,05,166	1,05,724	1	2,10,891
రాజోలు (ఎస్సీ)	205	96,552	98,637	1	1,95,190
పి.గన్నవరం (ఎస్సీ)	212	98,969	97,363	5	1,96,337
కొత్తపేట	262	1,23,389	1,11,692	5	2,48,392
మండపేట	223	1,05,949	1,11,69	4	2,17,645
మొత్తం	1,644	7,50,066	7,60,389	17	15,10,472

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గండేపల్లి: వ్యాన్ ఢీకొన్న ఘటనలో మోటారు సైకిల్‌పై వస్తున్న యువకుడు మృతి చెందాడు. రామేశంపేట సమీపంలో ఏడీబీ రోడ్డుపై మంగళవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేటకు చెందిన ఆలపాటి రాజేష్ (22) తాపీపని చేసుకుంటున్నాడు. పెద్దాపురానికి పని నిమిత్తం మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి జగ్గంపేట వస్తుండగా రామేశంపేట సమీపంలో ఏడీబీ రోడ్డుపై అతడిని ఎదురుగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేష్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ వ్యాన్‌ను నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

రావులపాలెం: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కొమరాజులంకలోని గౌతమీ గోదావరి పుష్కరఘాట్ వద్ద బుధవారం రావులపాలెంలోని ఇందిరానగర్‌కు చెందిన పలివెల శ్రీనివాస్ మౌళీ శంకర్ (18) లభించింది. సీనియర్ ఇంటర్‌లో మ్యాథ్స్ ఫెయిల్ కావడంలో శంకర్ ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతడి కోసం తండ్రి గోపి వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో శంకర్ మృతదేహం లభించడంతో విషాదఛాయలు నెలకొన్నాయి. తండ్రి గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని హెచ్‌సీ వైకుంఠరావు తెలిపారు.

సీతాకల్యాణం.. ఊరూరా మహోత్సవం



జి.మామిడాడలో కోదండ రాముడికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు



కల్యాణ ఘట్టంలో మంగళసూత్రం చూపిస్తున్న పండితుడు

- ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- రామాలయాల్లో ప్రత్యేక పూజలు



పి.గన్నవరంలో సీతమ్మకు సమర్పించిన కంత (సారె)

పెదపూడి: శ్రీరామ నవమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. వివిధ దేవాలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణ తంతను వీక్షించారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలో శ్రీకోదండ సీతారాముని కల్యాణం రమణీయంగా జరిగింది. తెల్లవారుజాము నుంచీ భక్తులు ఆలయ సమీపంలోని కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఉదయం ఆరు నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం 11.20 గంటలకు స్వామివారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు సీతారాములకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి, పలువురు భక్తులు స్వామివారికి మంచి ముత్యాలు తలంబ్రాలుగా సమర్పించారు. 11.35 గంటలకు ఆలయ ధర్మకర్త ఇంటి నుంచి ముత్యాలు, తలంబ్రాలు, 9 రకాల పండ్లు, పుష్పాలు, పట్టు వస్త్రాలను పల్లకిలో ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఇక్కడ ఆనవాయితీగా సాగే పిల్లల వేలంపాట జరిగింది. భక్తులకు ఆలయ అధికారులు ముత్యాల తలంబ్రాలు, బియ్యం పంపిణీ చేశారు.

కనువిందు చేసిన కోవా సారె

పి.గన్నవరం: స్థానిక పట్టాభి రామాలయం వద్ద సీతారామస్వామివారి కల్యాణ మహోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అర్చకస్వామి వాడపల్లి రాంబాబు నేతృత్వంలో కల్యాణం నిర్వహించారు. సత్యవాణి దంపతులు కోవాతో తయారు చేయించిన 108 రకాల స్వీట్లు, పిండి వంటలను శ్రీరాముని తరఫున సీతమ్మకు సారె (కంత)గా సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

జగన్మోహినీ కేశవస్వామి కల్యాణం



జగన్మోహినీ కేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి 8.45 గంటలకు వేద మంత్రోచ్చారణ నడుమ రమణీయంగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర పండితుడు, పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరుకు చెందిన శ్రీనివాసులు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, ఆలయ అర్చకులు కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో జరిగిన కల్యాణ వేడుకలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను గర్భగుడి నుంచి కల్యాణ మంటపం వరకూ తోడ్కొని వచ్చారు. ముందుగా ప్రత్యేక పూజలు జరిపారు. సంప్రదాయ ప్రకారం ఆలయ ఈవో బి.కృష్ణ చైతన్య పట్టు వస్త్రాలు, మంగళసూత్రాలను సమర్పించారు. ఉత్సవ విగ్రహాలను ఉదయం గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో బి.కృష్ణ చైతన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

బిల్డింగ్ పైనుంచి పడి తాపీమేస్త్రి మృతి

గోపాలపురం: బిల్డింగ్‌పై నుంచి పడి తాపీమేస్త్రి మృతి చెందిన ఘటన భీమోలు గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురానికి చెందిన షేక్ యాసీన్ (36) తాపీమేస్త్రి. బుధవారం భీమోలు గ్రామంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ బిల్డింగ్‌పై నుంచి జారి పడ్డాడు. తలకు తీవ్ర గాయమైన అతడిని గోపాలపురం సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై మౌనిక

సామర్లకోట: పట్టపగలే మహిళ మెడలో గొలుసును దొంగ తెంపుకొని పారిపోయాడు. సత్యనారాయణపురంలో బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. బాధితురాలు నాగం సత్యవతి సమీపంలోని రామాలయం వద్దకు వెళ్లడానికి తయారవుతోంది. ఆ సమయంలో సుమారు 40 ఏళ్ల ఒక వ్యక్తి ఇంటికి వచ్చాడు. ఏమి కావాలని అడిగేలోపు సత్యవతి పీకనొక్కి మెడలోని గొలుసును లాక్కుని పరారయ్యాడు. ఆ ఐదు కాసుల బంగారు గొలుసులో రెండు కాసుల ముక్కను దొంగ లాక్కుని పరారయ్యాడు. మూడు కాసుల ముక్క సత్యవతి చేతిలో ఉండిపోయింది. వార్డు కౌన్సిలర్ సేపెని సురేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై మౌనిక సంఘటనా ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ వైభోగమే..



విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న వాడపల్లి క్షేత్రం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

- నేటి నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు
- భక్తుల కోసం సర్వం సిద్ధం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి వారం రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. రాష్ట్ర నలు మూలల నుంచి లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాలను ప్రారంభిస్తారు. దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయి.

భక్తులకు వసతులు

కల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఎండ తగలకుండా చలువ పందిళ్ల వేయించారు. అక్కడ గాలి కోసం ఫ్యాన్లు అమర్చారు. స్వామివారి దర్శనానికి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భారీ క్యూలైన్లు కట్టారు. లొల్ల నుంచి వాడపల్లి వరకూ అడుగడుగునా స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు. చిరు వ్యాపారులు పలు దుకాణాలను ఏర్పాటు చేశారు. వాడపల్లి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. భక్తులకు స్వామివారి ప్రసాదం కొరత రాకుండా సుమారుగా 50 వేల లడ్డూలను తయారు చేసి సిద్ధంగా ఉంచారు.

24న శ్రీపుష్పోత్సవంతో పూర్తి

ధ్వజారోహణ, అంకురార్పణ, నిత్య బలిహరణ కార్యక్రమంతో గురువారం వాడపల్లి తీర్థ మహోత్సవం ప్రారంభమవుతుంది. శుక్రవారం రథోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహిస్తారు. స్వామివారికి ప్రభుత్వం తరఫున ఆర్‌డీవో సత్యనారాయణ నూతన వస్త్రాలు సమర్పిస్తారు. రాత్రి 7.01 గంటలకు భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆగమన శాస్త్ర ప్రకారం కల్యాణ ఘట్టాన్ని వేదమంత్రోచ్చారణలతో జరుపుతారు. 20న పొన్నవాహన మహోత్సవం, 21న సదశ్యం, 22న స్వామివారికి ప్రత్యేక పూజలు, గౌతమి గోదావరిలో సాయంత్రం 7 గంటలకు తెప్పోత్సవం నిర్వహిస్తారు. 23న గౌతమి గోదావరిలో భక్తుల సమక్షంలో స్వామివారికి చక్రతీర్థ స్నానం జరుగుతుంది. 24న జరిగే శ్రీపుష్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు

- యాగశాలలో ప్రత్యేక హోమాలు
- సత్యదేవుని ఆలయంలో పూర్తయిన ఏర్పాట్లు

అన్నవరం: సత్యదేవుని ఆలయంలో నూతన స్వర్ణ ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించేందుకు యాగశాల నిర్మించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐదు హోమగుండాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ధ్వజస్తంభం కర్రను స్వామివారి ఆలయంలోని అనివేటి మండపం వద్దకు చేర్చారు. దానిని నిలబెట్టేందుకు కాంక్రీట్‌తో పునాదిని సిద్ధం చేశారు. మంటపం శ్లాబ్ నుంచి ధ్వజస్తంభం వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేశారు.

22న ప్రతిష్ఠాపన

నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠకు సంబంధించి గురువారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకూ ప్రత్యేక పూజలు చేస్తారు. గురువారం ఉదయం 11 గంటలకు వినాయక పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, మండపారాధన, జలాదివాసం నిర్వహిస్తారు. శుక్రవారం క్షీరాదివాసం, శనివారం పుష్పాదివాసం, ఆదివారం ధాన్యాదివాసం, 22వ తేదీ కలాన్యాశం, శయ్యాదివాసం తదితర పూజలు నిర్వహిస్తారు. అనంతరం 22వ తేదీ ఉదయం 10.48 గంటలకు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఆ తర్వాత స్తంభానికి రాగి రేకు అమర్చి స్వర్ణ రేకు తాపడం చేయనున్నారు. ఇందుకయ్యే ఖర్చంతా నెల్లూరుకు చెందిన భక్తుడి కుటుంబ సభ్యులు భరిస్తున్న సంగతి తెలిసిందే.



ధ్వజస్తంభం మొదలు భాగంలో చేసిన రాగి రేకు తాపడం

వెంకన్న కల్యాణానికి సర్వం సిద్ధం

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తల మండలి సర్వం సిద్ధం చేసింది. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు నిర్మించి, లోపల ఇంటీరియల్ డెకరేషన్ చేయించారు. వేల మంది భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేలా కుర్చీలు ఏర్పాట్లు చేశారు. కల్యాణ వేదికను మామిడి తోరణాలు, పూల దండలతో అలంకరించారు. శుక్రవారం జరిగే స్వామివారి తీర్థం, రథోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ చైర్ పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, అర్చకులు పర్యవేక్షిస్తున్నారు.

చదరంగం పోటీలలో బాలల ప్రతిభ



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అమలాపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం విద్యానిధి స్కూలులో బుధవారం జిల్లా స్థాయి అండర్ -17 చెస్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా బాలబాలికలు చదరంగంలో తమ ప్రతిభను చాటారు. నలుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీలను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకట సురేష్ పర్యవేక్షించారు. బాలుర విభాగంలో ద్రాక్షారపు సాత్విక్, బండారు నాని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో పినిశెట్టి ధరణి, నూకపెయ్యి హన్విక మొదటి, రెండు స్థానాల్లో నిలిచారు. విజయవాడలోని పోరంకి గ్రీన్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఈనెల 20వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు నలుగురూ జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తారు. కాగా.. జిల్లా స్థాయి పోటీలకు 40 మంది బాలబాలికలు హాజరయ్యారు. విజేతలకు విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు బహుమతులు అందజేశారు.

అక్రమ నగదు, మద్యం రవాణాపై ఉక్కుపాదం

- 51 మంది అరెస్ట్, రూ.1.28 లక్షల స్వాధీనం
- విస్తృతంగా అధికారుల తనిఖీలు



పామర్రు గ్రామంలో కేంద్ర బలగాల కవాతు

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో కోడి పందేలు, పేకాటలతో పాటు అక్రమం మద్యం, నగదు రవాణాలపై అధికారుల తనిఖీలు, దాడులు విస్తృతంగా జరుగుతున్నాయి. వీటిలో భాగంగా జిల్లాలో 51 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1.28 లక్షలు, 13 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో పోలీస్, ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు జిల్లాలో మంగళవారం చేపట్టిన తనిఖీలు, దాడుల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో వివరించింది.

- కాట్రేనికోన పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి నుంచి 17 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 3.06 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- రావులపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట, కోడి పందేలపై దాడులు చేసి 43 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 13 కోడి పుంజులు, 10 కోడి కత్తులు, 15 మోటారు సైకిళ్లు, మూడు కార్లు, రూ.1.28 లక్షల నగదు సీజ్ చేశారు.
- అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రాజోలు, రామచంద్రపురం, కొత్తపేట ఎస్ఈబీ స్టేషన్ల పరిధిలో ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి 14 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 30 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 8.34 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి.
- సమస్యాత్మక గ్రామమైన పామర్రులో పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో కలసి బుధవారం సాయంత్రం కవాతు నిర్వహించారు. పోలింగ్ బూత్‌లకు నిర్భయంగా వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేందుకు మేమంతా బందోబస్తుతో భరోసాగా ఉంటామని ప్రజలకు హామీ ఇచ్చాయి.

కట్నం వేధింపులతో వివాహిత మృతి



అనూష (ఫైల్)



విచార వదనంతో మానస్

కొత్తపల్లి: కట్నం కోసం అత్తింటి వేధింపులు తట్టుకోలేక ఒక వివాహిత ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పాడకు చెందిన కోటి అనిల్‌కు రాజోలుకు చెందిన కొండా అనూష (29)తో 2019 జూన్‌లో వివాహమైంది. వీరికి 4 ఏళ్ల మానస్ అనే కుమారుడు ఉన్నాడు. వివాహ సమయంలో రూ.3 లక్షల కట్నం, 3 కాసుల బంగారం, పలు లాంఛనాలు ఇచ్చారు. అయినా అత్తమామలు, భర్త, ఇద్దరు ఆడపడుచులు అదనపు కట్నం కోసం అనూషను వేధిస్తున్నారు. పుట్టింటి వారితో మాట్లాడాలంటే భర్తే దగ్గర ఉండి ఫోన్ చేయించేవాడు. మనవడు మానస్‌తో కూడా మాట్లాడలేని పరిస్థితిని తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో వారి వేధింపులు తాళలేక అనూష బుధవారం ఉరి వేసుకుని మృతి చెందింది. ఆమె తల్లి కొండా నీల సత్యవతి ఫిర్యాదు మేరకు భర్త అనిల్, అత్తమామలు, ఆడపడుచులపై ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరో ఘటనలో..

కాకినాడ క్రైం: భర్త, అత్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జగన్నాథపురం ఏఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న నగరబోయిన వెంకటేశ్వర్లు, వెంకటరమణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారిలో పెద్ద కుమార్తె శిరీష (25)కు అమలాపురం మండలం కామనగరువుకు చెందిన దంగేటి శ్రీనివాస్‌తో గతేడాది సెప్టెంబర్‌లో వివాహం చేశారు. శ్రీనివాస్ కాకినాడలోని రైస్‌మిల్లులో పనిచేస్తున్నాడు. వివాహం తర్వాత ఈ దంపతులు జగన్నాథపురం కోమలవారి వీధిలో నివాసం ఉంటున్నారు. అయితే అనుమానం, అదనపు కట్నం వేధింపులతో అత్త గంగారత్నం, భర్త శ్రీనివాస్ చేతిలో శిరీష నిత్యం నరకం అనుభవించేది. వారిద్దరూ పలుమార్లు ఆమెను శారీరకంగా వేధించారు. మనస్తాపం చెందిన శిరీష మంగళవారం రాత్రి ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమె కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భర్త శ్రీనివాస్, తల్లి గంగారత్నంపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి దారుణ హత్య

- నిద్రిస్తుండగా పీక కోసి చంపిన మనవరాలి భర్త
- కుటుంబ కలహాలతో ఘాతుకం



గంటాలమ్మ మృతదేహం

కొత్తపేట: పెళ్లి చేసుకుని ఆనందంగా కాపురానికి వెళ్లిన ఆమె తన భర్త అనుమానపు జబ్బును చూసి బెంబేలెత్తిపోయింది. ఏదోలా రాజీపడి బతుకుతున్నా భర్త వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేకపోయింది. తల్లి లేని ఆమె తన అమ్మమ్మ ఇంటికి ఇద్దరు కుమారులతో కలిసి వచ్చేసింది. అయితే కోపం పెంచుకున్న భర్త ఆ అమ్మమ్మను దారుణంగా హత్య చేశాడు. మండలంలోని గంటి గ్రామంలో శిరిగినీడి గంటాలమ్మ (78) హత్య కలకలం రేపింది. ఎస్సై ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గంటాలమ్మ మనవరాలు (కూతురి కుమార్తె) నాగదేవికి సుమారు 9 ఏళ్ల క్రితం తెలంగాణలోని ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరం గ్రామానికి చెందిన సాదం రామకృష్ణతో వివాహం జరిగింది. కొంత కాలం వీరి సంసారం సజావుగా సాగింది. అనంతరం భార్యపై అనుమానంతో రామకృష్ణ తరచూ గొడవలు పడేవాడు. ఆ క్రమంలో తన తమ్ముడి నరేష్‌తో అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో అతడిని గొడ్డలితో నరికి హత్య చేశాడు. ఈ కేసులో అరెస్టైన రామకృష్ణ కొన్నేళ్ల క్రితం జైలు నుంచి బయటకు వచ్చాడు. ఆ తర్వాత పెద్దల సమక్షంలో భార్యాభర్తలు రాజీపడ్డారు. భార్య కోరిక మేరకు ఆలమూరు మండలం చెముడులంకలో కాపురం ప్రారంభించారు. కానీ రామకృష్ణ అనుమానంతో మళ్లీ నాగదేవిని చిత్రహింసలకు గురిచేశాడు. అవి భరించలేని నాగదేవి తన ఇద్దరు కుమారులతో గంటిలో అమ్మమ్మ గంటాలమ్మ ఇంటికి వచ్చేసింది. గత ఏడాది అక్టోబర్‌లో తన భార్యను కాపురానికి పంపించాలని గంటాలమ్మతో రామకృష్ణ ఘర్షణ పడ్డాడు. ఆమెపై దాడి చేసి, ఇంటిలో వస్తువులు చెల్లాచెదురు చేసి, చంపేస్తానంటూ బెదిరించాడు. దీంతో నాగదేవి కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, రామకృష్ణను అరెస్టు చేశారు. స్థానిక సబ్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన రామకృష్ణ బుధవారం తెల్లవారుజామున గంటాలమ్మ ఇంట్లోకి ప్రవేశించాడు. హాల్లో నిద్రిస్తున్న గంటాలమ్మ పీకను కత్తితో కోసేశాడు. ముఖం, భుజంపై విచక్షణారహితంగా నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అమ్మమ్మ కేకలకు పక్క గదిలో పిల్లలతో కలిసి నిద్రిస్తున్న నాగదేవి భయంతో తలుపులు వేసుకుని దాక్కుంది. రామకృష్ణ వెళుతూ ఏదోరోజు నిన్ను కూడా చంపేస్తానని భార్యను బెదిరించాడు. సమాచారం అందుకున్న రావులపాలెం సీఐ రామ్‌కుమార్, ఎస్సై ఎం.అశోక్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అశోక్ తెలిపారు.